# ప్రేతాత్మ ప్రతీకారం

## విచిత్ర వాస్తవాలు

మధ్యప్రదేశ్‌లోని నర్మదా లోయలో బాదు, బర్బారా అనే రెండు ఇరుగు పొరుగు గ్రామాలున్నాయి. ఈ రెండు గ్రామాలకీ మధ్యన బీడుగా వుండిపోయిన స్థలం ఒకటి వుంది. దానిని ఎవరూ సాగుచేయరు. ఎందుకంటే పరమ క్రూరుడైన ఒక వ్యక్తి దానికి సొంతదారుడిగా వుండేవాడట. ఆయన చని పోయినా ఆ స్థలం మీది మమకారంతో ఆయన ఆత్మ దానిలో ఎవరినీ అడుగు పెట్టనీయదట. గ్రామస్థులకి పోనేలేదు. అయితే ఈ ఆత్మని అంతగా విశ్వసించని బాదు గ్రామానికి చెందిన ఒక రైతు ఒక రోజు ఆ స్థలంలోని అర ఎకరం పొలాన్ని తన పొలంలో కలుపుకుని దున్నాడట. అదే రాత్రి ఆ రైతు కుమారునికి పాము కాటేసి స్పృహతప్పి పడిపోయాడట. పొలం దున్నిన రెండు ఎద్దులకీ అకస్మాత్తుగా మురేస్ వ్యాధి వచ్చి నేలవాలి పోయాయట. వెంటనే తన తప్పిదం తెలుసుకుని ఆ రైతు బర్బారా గ్రామంలోని దేవాలయానికి వెళ్ళి తన తప్పు క్షమించవలసిందనీ, ఆ అర ఎకరాన్నీ తిరిగి అంటుకోననీ, పైగా అందులో చనిపోయిన ఆ సొంతదారు పేరిట గుడికట్టి పూజా పునస్కారాలు చేస్తాననీ మొక్కుకున్నాడట. వెంటనే విచిత్రంగా అతని కుమారుడు నిద్ర నుంచి లేచినట్టు లేచి కూర్చున్నాడట. ఎద్దులకి సోకిన వ్యాధి పోయి మామూలుగా లేచి తిరిగాయట.

ఆ రోజుల్లో లిండ్సే అనే ఆంగ్లేయాధికారి బెంగాల్ సివిల్ సర్వీస్‌లో వుండేవాడు. ఆయన అక్కడ భూమిని సర్వే చేస్తూ ఈ స్థలాన్ని కూడా సర్వే చేయబోయాడు కాని, ఆ స్థలాన్ని సర్వే చేయడానికి ఎవరూ ముందుకు రాలేదట. నయాన చెప్పినా, భయాన చెప్పినా ఎవరూ వినలేదట. దాంతో ఆ స్థలాన్ని తానే కొలవడానికి నడుం కట్టాడట. ఆయన త్రాడుతో కొలుస్తుండగా ఏ కారణం లేకుండానే ఆ త్రాడు తెగిపోయిందట. అంతటితో ఆగలేదు. మర్నాడు ప్రొద్దున అకస్మాత్తుగా జబ్బుపడడంతో లిండ్సే నర్సింగ్‌పూర్ వెళ్ళిపోవలసివచ్చింది. ఆయనకి వచ్చిన జ్వరం ఏమిటో, దానికి కారణం ఏమిటో వైద్యులకి అంతుపట్టలేదు.



కొద్ది రోజులకే ఆ జ్వరంతోనే ఆయన కన్నే మూశాడు. మరి ఇది ప్రేతాత్మ ప్రతీకారమనుకోవాలా? యాదృచ్ఛికమనుకోవాలా? పరిష్కారం దొరకని ప్రశ్నలివి.

— శ్రీముఖి

# నీతిలేని కథ

ఆ సందులోకి అతడు అడుగు పెట్టగానే... ఆహ్వానాలు మొదలయ్యాయి- పైటలు జార్చి, పాటలు పేర్చి.

అతను ఒక్కొక్కరిని దాటుకుంటూ పోతున్నాడు. జేబులో నోటు గరగరమంటోంది. మదిలో కోరిక కరకరమంటోంది. చూపు చరచరా ఒంపుల్ని ఒరుసుకుంటూ ప్రాకుతుంది.

ప్రాకి ప్రాకి ఓ అమ్మాయి దగ్గర చిక్కుకుంది అతని చూపు. ఆ వాణీ సుందరి పెదాలు దొండ పళ్ళలా వున్నాయి. బుగ్గలు యాపిల్స్‌లా, గుండెలు బత్తాయిల్లా వున్నాయి. మొత్తంగా అరముగ్గిన గుమ్మడి పండులా వుంది.

వాణిలో చిక్కుకున్న అతన్ని ఓ చిరునవ్వుతో చేజిక్కించుకుంది. గుడిసె కళ్ళు మూసుకుంది. లోపల గోడలు పాపం రంగులో వున్నాయి. దండెకు దుప్పటి దారిద్ర్యంలా వేలాడుతోంది. కుక్కి మంచం ఆకలి కడుపులా వుంది.

"ఎంత?" అతని ప్రశ్న.

ఆమె చెప్పింది.

"పదిహేనిస్తాను" అతడు బేరం పెట్టేడు.

"కుదర్దు"

"నీ ఇష్టం" అంటూ వెను తిరగబోతున్న అతన్ని సరే అంటూ ఆపింది. ఇరవై నోటు తీసి



ఇచ్చాడు. గూట్లో పెడుతూ చెప్పింది. "మంచానికి అయిదు"

"ముందు చెప్పాల్సింది" ఖంగు తిన్నాడు.

"బాటా జోడెప్పుడూ కొనలేదా? సేల్స్ టాక్స్ రేటుతో కలిపి చెప్పరు"

అతను కోపంగా చూశాడు. ఆమె నిర్లక్ష్యంగా చూసింది.

ఒక్క క్షణం... రాజీన కోరిక రగలబోతున్న కోపాన్ని అణచేసింది. కామం బరువుకి మంచం మూలిగింది.

రవిక హుక్ వైపుకి ప్రాకబోతున్న అతని చేతిని ఆపుతూ అంది. "దానికయితే మరో పదవుతుంది".

"అమ్మ..." అతని పళ్ళ బిగువున బూతు పదం.

"అవును... నే నీ పెళ్ళాన్ని కాను"

అతనిలో ఉక్రోషం, ఉద్రేకం రెండూ చర్రున పెరిగేయి. ఆమె రవికె పర్రున చిరిగింది. అంతే తోక తొక్కిన తాచైంది ఆమె.

మరుక్షణం.. రోడ్డుపై నడుస్తున్న వార్ని గుడిసె ముందు దృశ్యం నిలిపేసింది. అతి కష్టం మీద ఆమె పట్టులోంచి తన షర్టుని విడిపించుకోగలిగేడు. వేలాడిన బటన్ని సవరించుకొంటూ వెళ్ళిపోతున్న అతనికి వెనుక నుంచి ఆమె తిట్లు వినిపిస్తున్నాయి. ఎటువంటి పర్యాయ పదాలు వాడకుండా తిదు తోంది..

"ఛీ! నీతిలేని ముండ" గొణుక్కున్నాడు అతను.

ఇంతకీ నీతి లేనిదెవరికి?....

– మోహన్

